క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శివాలయం ఎదుట స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. దివంగత ఎన్.నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎన్.నాగరాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, దానబోయిన నాగయ్య, షేక్ షఫీ, షేక్ గౌస్, జాన్, బడేమియా పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు కృషి



తాడేపల్లిరూరల్: దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ, రూరల్ కమిటీ విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రతి చిన్న విషయాన్ని అడ్డుపెట్టుకుని మతత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. నీటి కుళాయిలకు మీటర్లు పెట్టడం, వ్యవసాయ బోరులకు మీటర్లు పెట్టడం, విద్యుత్ ఛార్జీలు పెంచడం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం విధానాలుగా పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈనెల 19న అమరజీవి పుచ్చలపల్లి సుందయ్య వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

హజ్ యాత్ర విషయంలో రాజకీయం తగదు

తాడేపల్లిరూరల్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్ర టికెట్ ధరల విషయంలో రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష నేతలు రాష్ట్ర ప్రభుత్వం ధరలు పెంచినట్లు మాట్లాడడం తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శనివారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హజ్ యాత్రకు ధరలు నిర్ణయించేది సెంట్రల్ హజ్ కమిటీ అని ఇందులో రాష్ట్ర కమిటీకి గానీ, రాష్ట్ర ప్రభుత్వానికి గానీ ఎటువంటి సబంధం ఉందని అన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జానీ, షేక్ రషీద్, షేక్ హుసేన్, పఠాన్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

నేడు మహంకాళీ అమ్మవారు గ్రామోత్సవం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారికి ఆదివారం హంసవాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి శనివారం తెలిపారు. ప్రతిష్ఠా వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని శ్రీ ధనలక్ష్మిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు చెప్పారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిరుపేదలకు సరుకులు అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరికి చెందిన రెండు కుటుంబాలకు నిత్యావసరాలను వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం అందజేయించారు. ఎమ్మెల్యే సహకారంతో అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నులకపేటలో పేకాటాడుతున్న ఆరుగురిని శనివారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. నులకపేట మసీదు రోడ్డు చివర ముళ్లపొదల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. ఆరుగురు ఆటో డ్రైవర్లు పేకాట ఆడుతూ కనిపించారని, వీరి నుంచి రూ.3500 స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి కాలనీ సమీపంలో ఉన్న గుంటూరు చానల్‌లో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మంగళగిరి టౌన్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. యర్రబాలేనికి చెందిన కాకుమాను జోసఫ్(48) వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకున్న అనంతరం మద్యం తాగి గుంటూరు చానల్ ఈత వేయడానికి వెళ్లి మునిగిపోయాడని భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గుంటూరు చానల్ గాలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



నిడుముక్కలలో సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నిడుముక్కల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం పేదలకు చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. దానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సేవలందిస్తున్నట్లు వివరించారు. పేదలకు ఉచితంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను చేరువ చేసి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తూ ఉచిత సేవలను అందిస్తున్న జగనన్న పాలనలో పేదలు సంతోషంగా ఉన్నారనడంలో సందేహం లేదని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నికల హామీలన్నీ గాలికి వదిలేసి పేదలను నిలువునా మోసం చేశారని, కానీ అందుకు భిన్నంగా నేడు ఏపీలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి గడప గడపకు వెళ్లి అందించిన సంక్షేమాన్ని వివరిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. పేదలను నిరుపేదలుగా మార్చిన చంద్రబాబు కార్పొరేట్ వ్యవస్థలతో కుమ్మక్కై విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను దోచుకు తిని పేదలను అణగదొక్కాడని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అండగా నిలవడంతో నేడు పేదలు ఆర్థికంగా ఎదుగుతున్నారనడంలో సందేహం లేదన్నారు. ఈ సందర్భంగా సర్పంచి మాదాసు రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గుడిమెట్ల జ్యోతితో కలసి రిబ్బన్ కత్తిరించి సచివాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీటీసీ బోడపాటి సుశీల, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ముఖ్య నాయకులు తాళ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బాకి వెంకటస్వామి, మాజీ ఉప సర్పంచులు మాదాసు ఏసురత్నం, గుంటి రఘువరన్, యార్డు మాజీ వైస్ ఛైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, ఉయ్యూరు వెంకటరెడ్డి, మల్లంపాటి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో జగనన్న కాలనీలలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. నిడుముక్కల గ్రామంలో గృహ నిర్మాణ శాఖాధికారులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా ప్రతి పేదవాడికి అదనపు రుణం ఇప్పించి అయినా సరే త్వరిత గతిన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ శంకరరావు, ఏఈలు ఓబుల్ రెడ్డి, దివ్య, శ్రీనివాసరావు, గోపీకృష్ణ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన వర్క్‌షాప్



ముగింపు సభలో పాల్గొన్న వివిధ విభాగాల అధిపతులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో నిర్వహిస్తున్న పలు విభాగాల కార్యశాలలు శనివారంతో ముగిశాయి. ఈవెంట్ కన్వీనర్ బుర్రా వీఎల్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాక్సినాలజీలో అభివృద్ధి చెందుతున్న సంప్రదాయాలు, అధునాతన పద్ధతులపై వర్క్‌షాప్ మరియు సింపోజియం విజయవంతంగా ముగిసిందని చెప్పారు. ఈ కార్యశాలలో ఇటీవల సిలికో మల్టీ ఏపీ టోప్ ఆధారిత పెప్టైడ్ వ్యాక్సిన్ డిజైన్‌పై సింపోజియంతో పాటు రెండు రోజుల ప్రయోగాత్మక వర్క్‌షాప్‌ను నిర్వహించామని అన్నారు. మెరుగైన మానవ ఆరోగ్యం కోసం అడ్వాన్స్‌మెంట్స్ టు వర్డ్స్ ప్రెసిషన్ వ్యాక్సినాలజీ థీమ్‌తో ఈ కార్యక్రమం జరిగిందని తెలిపారు. కార్యశాలకు స్ట్రక్చరల్ బయోలజీ, డ్రగ్ డిజైనింగ్ వంటి ప్రముఖులు ప్రొఫెసర్ టీపీ సింగ్, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ప్రొ. జీపీఎస్ రాఘవ వంటి ఇమ్యూనో ఇన్ఫర్మేటిక్స్ మార్గదర్శకులు, వ్యాక్సిన్ డిజైన్, డెవలప్‌మెంట్ మరియు మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజలలో ప్రొ. హెడ్జ్ వంటి ప్రయోగాత్మక సాంకేతిక నిపుణులు, పద్మ భూషణ్, మహారాష్ట్ర భూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ భట్కర్ కొనసాగించారని తెలిపారు. గణితశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అంతర్జాతీయ కార్యశాలను నిర్వహించినట్లు గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బీవీ అప్పారావు తెలిపారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ సహకారంతో ఈ కార్యశాలను నిర్వహించామని వివరించారు. ఇందులో డాక్టర్ భరత్, ఎస్.సూర్యవంశీ ఆధునిక గణితంలో టెక్నాలజీ అనుసంధానం గురించి, పేటెంట్ హక్కులు ఎలా పొందాలి, తాము రూపొందించిన పత్రాలను ఇతరులు తస్కరించకుండా ఏ విధంగా కాపాడుకోవాలని అనే అంశాలను వివరించారని తెలిపారు. కార్యక్రమాలలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, పెడ్ కో ఆర్డినేటర్ డాక్టర్ జగదీష్‌కుమార్, అధ్యాపకులు, డాక్టర్ ఇమ్రాన్ ఆలి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరిధర్, ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ బి. జయకుమార్ సింగ్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం లోక్ అదాలత్ లక్ష్యం

మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై. నాగరాజు

తాడేపల్లిరూరల్: సత్వర న్యాయం లోక్ అదాలత్ లక్ష్యమని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజు అన్నారు. మంగళగిరి కోర్టు పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్ట పరిజ్ఞానం అవసరమని, లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లతో సమయం, డబ్బు ఆదా అవుతాయని, మూడు నెలలకొకసారి నిర్వహించే లోక్ అదాలత్‌లు కక్షిదారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులు రాజీ చేసుకోవాలని చెప్పారు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఒక టైమ్ సెటిల్‌మెంట్ కేసులను పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 1241 కేసులు పరిష్కారమయ్యాయి.

అనిల్‌పై మరో కేసు నమోదు

తాడేపల్లిరూరల్: దాడి కేసులో అనిల్‌పై కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలో ముగ్గురోడ్డు సెంటర్‌లోని ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన అనిల్‌పై రెండు రోజుల కిందట కేసు నమోదు కాగా తాజాగా మరో కేసు నమోదు చేశారు. బాబాయి కుమార్తె కంచర్ల దేవమణి.. అనిల్ వల్ల నాకు ప్రాణహాని ఉందని, తరచూ నన్ను కొట్టి తిడుతున్నాడని ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా అదే ప్రాంతంలో నివాసముండే బాజి తనను కొట్టి తన వద్ద సెల్‌ఫోన్ లాక్కొని ఊరు నుండి వెలివేశాడని, అనిల్‌తో విజయవాడలో నగర బహిష్కరణకు గురైన పడ్డా దుర్గారావు అలియాస్ కర్రె బియా ఇద్దరూ కలసి మూడు నెలల క్రితం తనను కొట్టి చిత్రహింసలు చేశారని, వారి బాధలు భరియించలేక ఇక్కడి నుంచి వెళ్లిపోగా.. బాజి తాతయ్య చనిపోయాడని తెలిసి ఇక్కడ వస్తే బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

చట్టబద్ధత లేని సీపీఎస్‌ను రద్దు చేయాలి

తాడేపల్లిరూరల్: చట్టబద్ధత లేని సీపీఎస్‌ను రద్దు చేయాలని, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. శనివారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం దుగ్గిరాలలో నిర్వహించారు. సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 22వ తేదీ నుంచి ఆందోళన బాటపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.పెదరత్తయ్య, దుగ్గిరాల తాలూకా యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, సహాధ్యక్షులు వంకదార సుబ్బారావు, ఉపాధ్యక్షులు దమ్ము ఆశీర్వాదమ్మ, సంయుక్త కార్యదర్శి బొల్లంపల్లి బుజ్జి, సుజాత, గుండిమెడ శ్రీనివాసరావు, సుదర్శన శాస్త్రి, గంగవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ ఉత్సవాలు

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులోని పోలేరమ్మ అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకలలో భాగంగ ఉదయం అమ్మవారికి మండప ఆరాధన రుద్రాభిషేకం కుంకుమా అర్చన, విఘ్నేశ్వర పూజ ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయ సంచాలకులు



ఇప్పటంలో జొన్న, మొక్కజొన్నలను పరిశీలిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: నగర పరిధిలని ఇప్పటం రైతు భరోసా కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంగళగిరి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి శనివారం సందర్శించారు. అనంతరం తడిసిన జొన్న, మొక్కజొన్న ఉత్పత్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తేమ 14శాతం ఉంటే మొక్కజొన్న క్వింటాల్‌కు మద్దతు ధర 1962 రూపాయలకు ప్రభుత్వం సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తుందని అన్నారు. మండల పరిధిలోని రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి వారి వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న చిలువూరు ముగ్గురు రాజుల దేవాలయం నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ చిలువూరు ముగ్గురు రాజుల దేవాలయం ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ డాక్టర్ చాట్ల మరియదాసు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై కొంతమంది దాడి చేస్తున్నారని ప్రభుత్వం క్రైస్తవులపై దాడిని నివారించాలని, వారి దాడిచేసేవారి మనస్సు మారాలని ముగ్గురు రాజుల దేవాలయం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.

రైలులో మద్యం అక్రమ రవాణా

- మధ్యప్రదేశ్ మద్యంగా గుర్తింపు
- ఇద్దరిపై కేసు నమోదు



శ్రీకాంత్, విజయ్ కుమార్‌లను అరెస్ట్ చూపిస్తున్న ఎస్ఇబీ సీఐ మారయ్య

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్ పరిధిలో మధ్యప్రదేశ్ నుంచి రైలులో తీసుకువచ్చిన మద్యాన్ని దింపి మంగళగిరి తరలిస్తుండగా మార్గమధ్యంలో మంగళగిరి ఎస్ఇబీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని శనివారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మారయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌లో మద్యం కొనుగోలు చేసి అవి కనిపించకుండా ప్యాకింగ్ చేసి ట్రెన్‌లో భారీగా మద్యం తరలిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు మంగళగిరి ఎస్ఇబీ కార్యాలయం ఆధ్వర్యంలో తాడేపల్లి కృష్ణా కెనాల్ వద్ద నిఘా ఏర్పాటు చేశామని, శనివారం తెల్లవారుజామున మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ట్రెన్ ట్రాక్ మారేందుకు స్టేషన్ శివారులో స్లో అవడంతో రైలులో నుంచి తెలంగాణా రాష్ట్రం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం, నక్కలగుట్ట తండాకు చెందిన ధరావత్ శ్రీకాంత్ మద్యం బాటిళ్లు కలిగిన మూడు మూటలను కింద పడవేశాడు. అనంతరం అతను కూడా కిందకి దిగాడు. మంగళగిరికి చెందిన తెనాలి విజయ్ కుమార్‌తో కలసి తీసుకువచ్చి ఆ మద్యం సీసాలను మోసుకువస్తూ ఉండగా వారిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద 180 మి.లీ. ఆఫీసర్స్ చాయిస్ 432 ప్లాస్టిక్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

గెలుపు కోసమే ఆడాలి

- ఓడిపోతే క్రీడాస్ఫూర్తి అనుకుని సరిపెట్టుకోరాదు
- అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మొవ్వా శ్యాంసుందరరావు



క్రీడాకారులతో శ్యాంసుందరరావు

తెనాలి: క్రీడాకారులు గెలుపు కోసమే ఆడాలి...ఓడిపోయినా పర్వాలేదు...క్రీడాస్ఫూర్తి అనుకుని సరిపెట్టుకోరాదని ఒకప్పటి ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు, కోచ్ మొవ్వా శ్యాంసుందరరావు స్పష్టం చేశారు. గొప్ప క్రీడాకారులు ప్రాక్టీస్ గేమ్‌లో ఓటమిని సైతం జీర్ణించుకోలేరని తెలిపారు. తెనాలికి చెందిన శ్యాంసుందరరావు వాలీబాల్ క్రీడలో ఉన్నత శిఖరాల్ని అందుకున్నారు. క్రీడాకారులు, శిక్షకులకు బహూకరించే అర్జున, ద్రోణాచార్య అవార్డుల్ని భారత ప్రభుత్వం నుంచి స్వీకరించారు. మిలటరీ, రైల్వేలో పని చేశారు. స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా 2001లో రిటైరయ్యారు. 2007–11లో జాతీయ కోచ్‌గా పని చేశారు. స్వస్థలం తెనాలి సమీపంలోని జంపని. ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం తెనాలి వచ్చారు. సాయంత్రం స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడా స్టేడియానికి వచ్చారు. ఇన్‌చార్జి, వాలీబాల్ కోచ్ కాకర్ల కోటేశ్వరరావు నేతృత్వంలో స్టేడియంలో వాలీబాల్ ఆటగాళ్ల సాధనను తిలకించారు. ఇదే స్టేడియంలో సాధన ఆరంభించి జూనియర్ నేషనల్స్, యూనివర్సిటీ స్థాయిలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్ని అభినందించారు. కాంబినేషన్‌తో కూడిన వాలీబాల్ ఆటలో ఏకాగ్రత, పట్టుదలతో సాధన చేసినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలరని సూచించారు. నిబద్ధతతో కూడిన సాధన చేసినపుడే మంచి క్రీడాకారులు కాగలగరని చెప్పారు. ఓటమిని తేలికగా తీసుకోరాదని, ఎక్కడ లోపం జరిగిందో సమీక్షించుకుని, పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. సాధన తర్వాత కూడా ఖాళీ సమయంలోనూ మెంటల్ రిహార్సల్స్ చేసుకోవడం అదనపు ప్రాక్టీస్ అవుతుందని చెప్పారు. ఓటమి చెందినపుడు జట్టులో తప్పొప్పుల్ని సానుకూల దృక్పథంతో చర్చించుకోవాలి మినహా కారకుల్ని వేలెత్తి చూపడం తగదన్నారు. గతంలో కోచ్‌లంటూ ప్రత్యేకంగా ఉండేవారు కాదని గుర్తుచేశారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆసక్తితోనే క్రీడలకు ప్రోత్సాహం లభించి, మంచి క్రీడాకారులు వచ్చారని సోదాహరణంగా చెప్పారు. తొలుత స్టేడియానికి వచ్చిన శ్యాంసుందరరావుకు కోచ్ కాకర్ల కోటేశ్వరరావు, వాలీబాల్ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు.

కూతురిపై తండ్రి లైంగిక దాడి

- నాలుగేళ్లుగా ఘాతకం
- ఆత్మహత్యాయత్నంతో బయటపడిన వైనం

తాడికొండ: కన్న కూతురిపై తండ్రి లైంగిక దాడి చేసిన ఘటన బండారుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బండారుపల్లి గ్రామానికి చెందిన యువతిపై కన్న తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2019లో తల్లి హోటల్ పని నిమిత్తం వెళ్లగా కుమార్తెపై తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లికి ఈవిషయం చెబితే చంపేస్తానని బెదిరించడంతో మౌనంగా భరించింది. అప్పటి నుంచి మూడేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఇప్పుడు నర్సింగ్ చదువుతున్న ఆ యువతి సెలవులకు ఇంటికి రాగా తిరిగి లైంగిక దాడికి పాల్పడబోగా ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోదరుడు అడ్డుకుని ఆరా తీయగా విషయం బయటపడింది. పోలీసుస్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా హనుమంతుని శోభాయాత్ర



శోభాయాత్రలో రథంపై ఆంజనేయస్వామి



1,108 అరటి పళ్లతో స్వామి అలంకరణ

తెనాలిటౌన్: పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని పుర వీధుల్లో శనివారం స్వామివారి శోభాయాత్రను నిర్వహించారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ భక్తులు ఆంజనేయుని జెండాను పట్టుకుని యాత్రలో పాల్గొన్నారు. ఆలయం నుంచి మెయిన్ రోడ్డు, గాంధీచౌక్, బోసు రోడ్డు, షరాఫ్ బజార్‌ల మీదుగా శోభాయాత్ర తిరిగి ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, భక్తి కీర్తనలతో సందడిగా సాగిన శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడారు. ఆదివారం నుంచి 24 వరకు జరిగే వార్షిక హనుమజ్జయంతి, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్‌బీ శివ, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

– గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో దాసాంజనేయస్వామి చతుర్దశ వార్షిక జయంతి మహోత్సవాలు బాలస్వామిజీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. శనివారం స్వామివారికి 1,108 అరటిపళ్లతో ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు జరిపారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మఠం సభ్యులు పాల్గొన్నారు.

– నాజర్‌పేటలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకం జరిపి, అరటి పళ్లతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కె.లోకనాథశర్మ, సెక్రటరీ ఎస్.వెంకటేశ్వరరావు, వారంశెట్టి లక్ష్మి సీతారామారావు, ప్రధాన అర్చకుడు వై.వెంకటనరసరాజు శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మృదంగ విద్వాంసుడు రామకృష్ణకు సత్కారం

తెనాలి: పట్టణంలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నట సార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, నటించిన సినిమాలపై చర్చా వేదిక నిర్వహించారు. పొన్నూరు వెంకట శ్రీనివాసులు, షేక్ అస్మతున్నీసా సినిమాల్లో అన్నగా ఎన్టీఆర్ అనే అంశంపై మాట్లాడారు. వక్తలతో పాటు ప్రముఖ ఏ–గ్రేడ్ మృదంగ విద్వాంసుడు, కంచి కామకోటి ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకట రామకృష్ణను సత్కరించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

వైకుంఠపురంలో వేడుకగా బ్రహ్మోత్సవాలు



తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం భరత నాట్యం, సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన ఆకట్టుకున్నాయని ఈఓ ఎం.తిమ్మానాయుడు తెలిపారు.

16న యూటీఎఫ్ ఉద్యమ తరగతులు



మాట్లాడుతున్న ఎం.కళాధర్

తెనాలి: విద్యారంగ పరిణామాలపై ఈ నెల 16న తెనాలిలోని పెన్షనర్స్ హోంలో జరగనున్న ఉద్యమ తరగతులను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ పేర్కొన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన తెనాలి ప్రాంతీయ శాఖల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఉద్యమ తరగతుల్లో సందేశం ఇస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు ప్రభుత్వ విధానాలపై మాట్లాడారు. జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి దేల, జిల్లా కార్యదర్శులు కె.సాంబశివరావు, ఆదినారాయణ, కె.రంగారావు, షేక్ అహ్మద్ హుస్సేన్, రామకృష్ణ పాల్గొన్నారు.